క్లుప్తంగా

మండల సమావేశం వాయిదా


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీనివాస్

చెన్నూర్‌రూరల్: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించాల్సిన మండల సర్వసభ్య సమావేశం కోరం లేకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. తిరిగి సమావేశం నిర్వహించే తేదీని త్వరలో ప్రకటించనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దండేపల్లి: మండలంలోని జైతుగూడకు చెందిన ఆడాయి మారుబాయి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబసభ్యులను మాజీ వైస్‌ఎంపీపీ రాజేందర్ పరామర్శించి రూ.5వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ట్రినిటీ పాఠశాలలో సైన్స్‌ఫేర్


పరికరాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

లక్సెట్టిపేట: మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో సైన్స్‌ఫేర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. విద్యార్థులు వారి యొక్క పరిజ్ఞానంతో తయారు చేసిన పరికరాలను పాఠశాల ప్రిన్సిపాల్ జోసెఫ్ పరిశీలించారు. అనంతరం పరికరాలను పరిశీలించి ఉత్తమ బహుమతులు ప్రకటించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఈటల రాజేందర్ రాక

నస్పూర్: ఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ హుజూరాబాద్ ఎమ్మెల్యే, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ ఆదివారం పట్టణానికి వస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అగల్‌డ్యూటీ రాజు తెలిపారు. శనివారం ఆయన నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈటల రాజేందర్ పట్టణంలో నిర్వహించే ర్యాలీ, కార్నర్ మీటింగ్‌లో పాల్గొంటారని తెలిపారు.

వాహనాల విస్తృత తనిఖీలు


కారును తనిఖీ చేస్తున్న ఎస్సై

బెల్లంపల్లి: అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని శనివారం బెల్లంపల్లిలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. టూటౌన్ ఎస్సై రమేష్ ఆధ్వర్యంలో చెక్‌పోస్టు వద్ద రోడ్డుకు ఇరువైపులా రాకపోకలు సాగిస్తున్న వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను నిశితంగా పరిశీలించిన తర్వాత పంపించారు. ఎన్నికల వేళ ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.50వేలకు పైబడి డబ్బులు తీసుకువెళ్లొద్దని ప్రయాణికులకు వివరించారు. కార్యక్రమంలో సాయుధ పోలీసు బలగాలు, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

జోరుగా వరికోతలు



మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికొచ్చింది. ఆలస్యం చేస్తే ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని రైతులు వరికోతలకు సిద్ధమయ్యారు. దీపావళి పండగ వేడుకలు ముగియడంతో రైతులు వరికోతలను వేగవంతం చేశారు. హాజీపూర్ మండలంలోని పలు గ్రామాల్లో రైతులు వరికోతలు ప్రారంభించారు. మండలంలోని రాపల్లి, నర్సింగాపూర్, గుడిపేట గ్రామ శివారుల్లోని పంటపొలాల్లో వరికోతలు ప్రారంభించిన రైతులు హార్వెస్టర్‌తో వరి కోతలు చేపట్టారు. ఓ రైతుకు చెందిన వరి పొలంలో హార్వెస్టర్ వరికోతలు చేస్తుండగా 'సాక్షి' క్లిక్ మనిపించింది. మొత్తం పొలాన్ని కోత కోసిన కోతల యంత్రంలో నూర్పిడి అయిన వడ్లని ట్రాక్టర్లలో నింపించారు. ఉదయం నుంచి ప్రారంభమైన కోతలు రాత్రి 7గంటల వరకు నిర్విరామంగా సాగాయి. ఎలాంటి సమస్యలు లేకుండా వరికోతలు పూర్తవుతుండటంతో రైతుల మోముల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.



పరీక్షలు చేసేదెవరు..?

- డెప్యూటేషన్‌పై ల్యాబ్‌టెక్నీషియన్లు
- ఇబ్బందుల్లో రోగులు..


రక్తనమూనాలను సేకరిస్తున్న స్టాఫ్‌నర్సు

దండేపల్లి: వైద్యరంగ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని ప్రభుత్వం గొప్పలు చెబుతోంది. కానీ కొన్నిచోట్ల సిబ్బంది కొరత, వసతుల లేమితో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. దండేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొన్ని నెలలుగా ల్యాబ్‌టెక్నీషియన్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పీహెచ్‌సీలో ఇద్దరు ల్యాబ్‌టెక్నీషియన్లు ఉండగా, ఉన్న ఇద్దరూ డెప్యూటేషన్‌పై వేరే చోటికి వెళ్లారు. దీంతో పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషియన్లు లేక రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఆరోగ్య కేంద్రానికి నిత్యం వందకు పైగా రోగులు వస్తుంటారు. వారంలో రెండు సార్లు గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుంటారు. దీంతో గర్భిణులకు హెచ్‌బీ టెస్టులు, సాధారణ రోగులకు డెంగీ, వైడల్ పరీక్షలు, థైరాయిడ్, జాండీస్, హెచ్‌బీ పరీక్షలు చేస్తుంటారు.

షాంపుల్స్ సేకరిస్తున్న స్టాఫ్ నర్సులు..

పీహెచ్‌సీలో ల్యాబ్‌టెక్నీషన్లు అందుబాటులో లేకపోవడంతో విధుల్లో ఉండే స్టాఫ్‌నర్సులు రోగుల నుంచి రక్తనమూనాలు సేకరిస్తున్నారు. వారు సేకరించిన రక్తనమూనాలను మంచిర్యాల టీహబ్ కేంద్రానికి, నిత్యం ప్రత్యేక వాహనంలో పంపిస్తుంటారు. రిపోర్టులు మరుసటి రోజు ఆన్‌లైన్‌లో పీహెచ్‌సీకి పంపిస్తుంటారు. ల్యాబ్‌టెక్నీషన్‌లు అందుబాటులో లేకపోవడంతో అప్పటికప్పుడు రిపోర్ట్ తెలుసుకునే వాటికి సైతం మరుసటి రోజు వరకు వేచి ఉండాల్సి వస్తుంది. ఇక్కడ వేతనం పొందుతూ, వేరే చోట పనిచేస్తున్న ల్యాబ్‌టెక్నీషన్ల డెప్యూటేషన్లు రద్దు చేసి, పీహెచ్‌సీలో అందుబాటులో ఉండేలా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై పీహెచ్‌సీ డాక్టర్ సతీష్‌ను సంప్రదించగా.. ఉన్న ఇద్దరూ ల్యాబ్‌టెక్నీషియన్లు డెప్యూటేషన్‌పై వెళ్లడంతో కొంత ఇబ్బంది ఉంది. రోగులకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నాయంగా స్టాఫ్‌నర్సులతో షాంపుల్స్ సేకరించి, పరీక్షల కోసం మంచిర్యాల టీహబ్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు.

జీఎంతో నూతన కమిటీ భేటీ

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ నాయకులు శనివారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిశారు. ఇటీవల డివిజన్ నూతన కమిటీ ఎన్నికైన నేపథ్యంలో అసోసియేషన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి ఆంతోటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో జీఎంను ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు. నూతన కమిటీని జీఎంకు పరిచయం చేశారు. కమిటీ సభ్యులు అసోసియేషన్ సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించాలని జీఎంను కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఏరియా ఉపాధ్యక్షుడు దేగల ప్రవీణ్ కుమార్, కార్యదర్శి నక్క సుమన్, నాయకులు అందే వెంకటేష్, రెడ్డపాక లక్ష్మణ్, గోదారి మురళి, శెట్టి శంకరయ్య, ప్రవీణ్, ఎర్రోళ్ల శంకర్ తదితరులు పాల్గొన్నారు.


జీఎంతో అసోసియేషన్ నాయకులు

'సాగునీరు ఇవ్వని పార్టీని ఓడించండి'

పాతమంచిర్యాల: తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు నిర్మించని, రైతులకు సాగు నీరివ్వని బీఆర్‌ఎస్‌ను ఓడించాలని సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ బలపరుస్తున్న ఇండిపెండెంట్ అభ్యర్థి అందె మంగ అన్నారు. జిల్లా కేంద్రంలోని పలు వార్డులలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జిల్లాలో గోదావరి ముంపు వల్ల నష్టపోయిన వారికి కనీసం నష్టపరిహారం చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ పార్టీ నాయకులు లాల్‌కుమార్, శ్రీనివాస్, శ్రీకాంత్, మల్లన్న, అరుణ, లక్ష్మి, బాపు, సామన్న, చిన్నన్న, రాములు పాల్గొన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న అందె మంగ

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లక్సెట్టిపేట: మండలంలోని గుల్లకోట, తలమల, కొమ్ముగూడెం గ్రామాల్లో ఎన్నికల సహాయాధికారి రాఘవేంద్రరావు శనివారం పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఎన్నికల సమయం సమీపిస్తున్నందునా, ప్రతి ఒక్కరూ ఓటు వేసేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లోని పలువురికి ఎన్నికల పోలింగ్ చిట్టీలను అందించి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ సమ్మక్క, బీఎల్‌వోలు పాల్గొన్నారు.


గుల్లకోటలో అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

క్యాంపస్ సందర్శించిన జడ్జి

మందమర్రిరూరల్: వేంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని సీఐఎస్‌ఎఫ్ క్యాంపస్‌ను జిల్లా ప్రిన్సిపల్ అండ్ జిల్లా జడ్జి శ్రీనివాసులు, డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రాంబ్రహ్మ చారి సందర్శించారు. ఇటీవల మందమర్రిలో కోర్టు ఏర్పాటుకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దానిలో భాగంగా జిల్లా జడ్జి సింగరేణికి సంబంధించిన సీఐఎస్‌ఎఫ్ క్యాంపు ఆఫీస్‌ను పరిశీలించారు. వారి వెంట సింగరేణి ఏరియా ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్ రెడ్డి, మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి, అధికారులు, అడ్వకేట్‌లు ఉన్నారు.


సీఐఎస్‌ఎఫ్ క్యాంపస్‌ను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలి

కాసిపేట: మండలంలోని కోమటిచేను పోలింగ్‌స్టేషన్‌ను శనివారం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి పరిశీలించారు. ఉదయం కాసిపేట 2గనిపై బందోబస్తు నిర్వహించిన అనంతరం వాకింగ్, రన్నింగ్ చేస్తూ సమీప ప్రాంతాల్లో పర్యటించారు. పోలింగ్ బూత్ పరిశీలించి వసతులు, సమస్యలపై ఎస్సైలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుపై వాహనదారుల పత్రాలు పరిశీలించి, హెల్మెట్‌పై అవగాహన కల్పించారు. కోమటిచేను గ్రామంలో యువతతో మాట్లాడి పలు సూచనలు చేశారు. చెడువ్యసనాల వైపు వెళ్లకుండా చదువు, క్రీడల వైపు మొగ్గు చూపాలన్నారు. ప్రశాంత వాతవరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని, ప్రతివ్యక్తి ఓటుహక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఆయన వెంట కాసిపేట ఎస్సై గంగారాం, మందమర్రి ఎస్సై చంద్రకుమార్ ఉన్నారు.

'చదువుతో పాటు సత్ప్రవర్తనతో మెలగాలి'

మందమర్రిరూరల్: విద్యార్థినులు చదువుతో పాటు సత్ప్రవర్తనతో మెలగాలని మందమర్రి సీఐ మహేందర్ రెడ్డి హితవు పలికారు. మందమర్రి పట్టణంలోని రామకృష్ణాపూర్ రోడ్డులో గల శ్రీ మంజునాథ ఫంక్షన్ హాల్లో శనివారం సింగరేణి మహిళా డిగ్రీ, పీజీ కళాశాల వారు నిర్వహించిన ఫ్రెషర్స్ డేకు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు సాధించి, జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మందమర్రి ఎస్సై చంద్రకుమార్, కళాశాల కరస్పాండెంట్ హిరాలాల్ ఉపాధ్యాయ, ప్రిన్సిపల్ సుష్మా, రాజేశం, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వాహనదారుల పత్రాలు పరిశీలిస్తున్న సీఐ

కాంగ్రెస్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి

- మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న సంఘం నాయకులతో ప్రేంసాగర్‌రావు

పాతమంచిర్యాల: నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మంచిర్యాల కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎఫ్‌సీఏ ఫంక్షన్ హాల్లో శనివారం మేరు కులస్తుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేదల సంక్షేమానికే కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మేరు కులస్తులకు ఉపాధి అవకాశాలు లేక దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని దర్జీ వృత్తి చేసుకునే కులస్తులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని, మేరు సంఘం భవన నిర్మాణం చేపట్టాలని పలు సమస్యలను నాయకులు ప్రేంసాగర్‌రావు దృష్టికి తీసుకురాగా ప్రేంసాగర్‌రావు స్పందిస్తూ మేరు కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా 500 మంది పార్టీలో చేరగా, వారిని పార్టీలోకి ఆహ్వానిస్తూ కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మేరు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సోమ శ్రీనివాస్, కార్యదర్శి సోమ ప్రదీప్‌చంద్ర, నాయకులు గట్ల సత్యనారాయణ, నోముల శ్రీనివాస్, మాడిశెట్టి అశోక్, ఆత్మకూరి నరేందర్, మంతెన భాస్కర్, రాయి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. మంచిర్యాల పట్టణ ఆర్‌ఎంపీ డాక్టర్స్ అసోసియేషన్ సభ్యులు ప్రేంసాగర్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.

పద్మశాలీ సంఘం నాయకులు కాంగ్రెస్‌లో చేరిక

పాతమంచిర్యాల: పద్మశాలీ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ దేవసాని నాగరాజు, జిల్లా అధ్యక్షుడు గాదాసు బాబు శనివారం కాంగ్రెస్‌లో చేరారు. వారికి ప్రేంసాగర్‌రావు కాంగ్రెస్ కండువా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పద్మశాలీ సంఘం కోశాధికారి సల్ల దేవేందర్, విశ్వబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు మట్టెల రమేష్, ఉమ్మడి జిల్లా సినీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పోల్సాని సత్యనారాయణ రావు, నడిపెల్లి శ్రీనివాసరావు, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు సాజిద్‌ఖాన్ ఉన్నారు.

'అభివృద్ధి చేసి చూపిస్తా'

నస్పూర్: త్వరలో జరగనున్న ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని ప్రేంసాగర్‌రావు అన్నారు. పట్టణ పరిధిలోని 18, 19, 21వార్డులకు సంబంధించిన కార్యకర్తల సమావేశం శనివారం విలేజ్ శ్రీరాంపూర్‌లో నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు పరిచి, అన్ని వర్గాల అభ్యున్నతికి పాల్పడుతామని తెలిపారు. పలువురు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

మిగిలిన వారికి కూడా ఇళ్ల పట్టాలిస్తా

- మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సింగరేణి ఇళ్లపట్టాలు రాకుండా మిగిలిపోయిన వారికి కూడా ఇళ్ల పట్టాలిప్పిస్తామని మంచిర్యాల బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు తెలిపారు. శ్రీరాంపూర్ ఆర్కే 8 కాలనీ డిస్పెన్సరీ వద్ద గల అంబేద్కర్ మైదానంలో శనివారం నిర్వహించిన ప్రచార సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. శ్రీరాంపూర్‌లో ఇప్పటికి 3వేల మందికి ఇళ్ల పట్టాలు ఇప్పించామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ పట్టాల కోసం ఎదురుచూసిన వారికి నేడు కేసీఆర్ పుణ్యమాని పట్టాలు వచ్చాయన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలు కొనసాగాలంటే, మరో మారు బీఆర్‌ఎస్‌ను గెలిపించాలన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో అమలుకాని సంక్షేమ పథకాలను నేడు తెలంగాణలో అమలు అవుతున్నాయన్నారు. మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌ను మరోసారి గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రజలకు ఏనాడు అందుబాటులో లేని నాయకులను గెలిపిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. అభివృద్ధి కావాలంటే కారుగుర్తుకు ఓటెయ్యాలన్నారు. ఈ సందర్భంగా పలువురు బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్‌రావు, నడిపెల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజిత్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు అక్కూరి సుబ్బయ్య, టీబీజీకేఎస్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు గుమ్మడి శ్రీనివాస్, రాజేంద్రపాణి, వేల్పుల రవీందర్, పెట్టం లక్ష్మణ్, వైద్య శ్రీలత తదితరులు పాల్గొన్నారు.


నస్పూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న దివాకర్‌రావు

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ప్రచారం..

నస్పూర్ మున్సిపల్ పరిధిలోని తాళ్లపల్లి ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఎమ్మెల్యే దివాకర్‌రావు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ వస్తే అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఐత శంకర్, అగ్గు మల్లేష్, రుకుం తిరుమల్, శెట్టి రమణ పాల్గొన్నారు.

ఒక్కసారి బీజేపీకి అవకాశం ఇవ్వండి

- చెన్నూర్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్


సుద్దాలలో ప్రజలకు నమస్కారం చేస్తూ...


రామకృష్ణాపూర్: ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

చెన్నూర్‌రూరల్: అసెంబ్లీ ఎన్నికల్లో కమలం పువ్వు గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ అన్నారు. మండలంలోని సుద్దాల, గంగారం గ్రామాల్లో శనివారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. తాను ఎల్లప్పుడూ ప్రజల మేలు కోరుతూ, అందుబాటులో ఉంటానన్నారు. అదే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎప్పుడూ హైదరాబాద్‌లో ఉంటారని, ఆపదలో నన్ను పిలిస్తే పది నిమిషాల్లో మీ వద్దకు వచ్చి సేవ చేస్తానని పేర్కొన్నారు. ప్రజలు ఒక్క సారి ఆదరించాలని కోరారు. మహారాష్ట్ర మాజీ మంత్రి, శాసన సభ్యుడు అశోక్ ఊకే, పెద్దపల్లి పార్లమెంటు జాయింట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, బీజేపీ నాయకులు మోర్ల శంకర్, కొటారి వెంకటేశ్, కొటారి బాపు, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

రామకృష్ణాపూర్: పట్టణంలోని ఏజోన్ తిలక్‌నగర్ ఏరియాలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. పార్టీ చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థి దుర్గం అశోక్ ఇంటింటికి వెళ్తూ ఓటు అభ్యర్థించారు. బీజేపీ ద్వారానే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేకూరుతుందని ఈ ఎన్నికల్లో ప్రజలు బీజేపీని ఆదరించాలని కోరారు.

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషి చేయాలి

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఉట్నూర్‌రూరల్: ఖానాపూర్‌లో బీఆర్‌ఎస్ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ అన్నారు. శనివారం ఎన్‌ఎస్‌యూఐ నాయకులు, యువకులు బీఆర్‌ఎస్‌లో చేరగా వారికి జాన్సన్ నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నాయకులు రమేశ్, ఎస్సీరెడ్డి, సోఫియాన్, ధరణి రాజేశ్, మర్సుకోల తిరుపతి, కొమ్ము విజయ్, చారులత రాథోడ్ పాల్గొన్నారు.

జన్నారం: బీఆర్‌ఎస్ అభ్యర్థి గెలుపునకు కృషి చేయాలని గ్రీన్ ఇండియా చాలెంజ్ డైరెక్టర్ బాదవత్ పూర్ణచంద్ నాయక్ అన్నారు. మండలంలోని కలమడుగు బీఆర్‌ఎస్ కార్యాలయంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు. నాయకులు విజయ్ ధర్మ, స్వదేశ్‌కుమార్, దేవేందర్, శంకర్ ఉన్నారు.

సంక్షేమ పథకాలు చూసి ఓటు వేయండి

ఇంద్రవెల్లి: దేశంలో ఎక్కడా లేని సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని, వాటిని చూసి ఖానాపూర్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్‌కు ఓటు వేయాలని జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ అన్నారు. మండలంలోని సట్వాజీగూడ, ఇంద్రవెల్లి గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ మారుతి డోంగ్రె, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ అంజద్, సర్పంచ్ జాదవ్ లఖన్, మడావి భీంరావ్, కోవ రాజేశ్వర్, కనక తుకారం, బాబు ముండే ఉన్నారు.


బీఆర్‌ఎస్ నాయకులతో జాన్సన్‌నాయక్

బీఆర్‌ఎస్‌కు విశేష ప్రజాదరణ

ఖానాపూర్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్‌కు విశేష ఆదరణ వస్తోందని ఎమ్మెల్సీ దండె విఠల్, తెలంగాణ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వేణుగోపాలచారి, ఏపీపీఎస్సీ మాజీ సభ్యులు రవీందర్‌రావు అన్నారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్ నాయక్‌తో కలిసి పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో పార్టీ శ్రేణులతో మాట్లాడారు.

ఊపందుకున్న బీఆర్‌ఎస్ ప్రచారం..

శివాజీనగర్ కాలనీలో 2వ వార్డు కౌన్సిలర్ కారింగుల సంకీర్తన, మాజీ ఉప సర్పంచ్ సుమన్, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కరిపె శ్రీనివాస్, బీఆర్‌ఎస్ మండల ఉపాధ్యక్షులు వెంకటప్పయ్య ఆధ్వర్యంలో ప్రచారం చేశారు.